క్లుప్తంగా

గాయత్రిలో చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. శనివారం నాటికి 87 వేల 980 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళాలు



మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన బండ్ల విష్ణుమూర్తి, లత దంపతులు లక్షా నూట పదహారు రూపాయలను ఆదివారం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శనిగరం కమలాకర్ రెడ్డికి అందజేశారు. అలాగే రాజన్న సిరిసిల్లకు చెందిన గుర్రాల నర్సింలు, మంజుల దంపతులు రూ.50 వేలు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ దాతలకు స్వామివారి చిత్రపటాలను అందజేసి శాలువాలు కప్పి సత్కరించారు. జూనియర్ అసిస్టెంట్ సంతోష్ కుమార్, సిబ్బంది లక్ష్మణ్, అర్చకులు ఉన్నారు.

రజక బిడ్డ శంకర్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

కామారెడ్డి అర్బన్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన కాంగ్రెస్ శాసనసభ్యుడు రజక బిడ్డ వీర్లపల్లి శంకర్‌కు మంత్రి పదవి ఇచ్చి సీఎం రేవంత్‌రెడ్డి, చరిత్రలో నిలవాలని చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర యువత కార్యదర్శి చాకలి నందు కోరారు. చాకలి ఎస్సీ సాధన సమితి, శాసనసభ్యుడు వీర్లపల్లి శంకర్‌కు మంత్రి ఇవ్వాలని రాష్ట్ర వ్యాప్తంగా డిమాండ్ చేస్తుందని అన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



కామారెడ్డి టౌన్: బీజేపీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ బన్సల్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని సన్మానించారు. ఆదివారం నిజామాబాద్ బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమీక్ష, లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యేలను ఘనంగా సత్కరించారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారం గ్రామంలోని కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. దీనిలో భాగంగా భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి, నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు గదులు ముందస్తుగా బుక్ చేసుకోవాలని, వచ్చిన తర్వాత ఇబ్బంది పడవద్దని ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్ అన్నారు.

వేద విద్యార్థులకు సామూహిక ఉపనయనం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డికి చెందిన శ్రీరామ కృష్ణ వైదిక వేద సంస్కృత పాఠశాల విద్యార్థులకు ఆదివారం స్థానిక దేవునిపల్లి కాకతీయ నగర్‌లోని శ్రీ వీర బ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో సామూహిక ఉపనయన కార్యక్రమం నిర్వహించారు. ఆచార్యులు శిర్లవంచ కృష్ణామాచార్యులు, జొన్నోజు నాగరాజాచార్యులు ఆధ్వర్యంలో వేద విద్యార్థుల ఉపనయం నిర్వహించగా వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు హాజరయ్యారు. కార్యక్రమంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు సంగయ్యాచారి, శ్రీరామజప లిఖిత ప్రచారకులు కృష్ణానందస్వామి, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రామానుజన్ గణిత పోటీ పరీక్ష విజయవంతం



కామారెడ్డి టౌన్: గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఎస్పీఆర్ పాఠశాలలో ఆదివారం రామానుజన్ గణితం పోటీ పరీక్ష విజయవంతంగా నిర్వహించారు. ఈ పరీక్షలో ప్రతిభ చాటి మొదటి బహుమతి పొందిన విద్యార్థికి రూ.10వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.5 వేలు, తృతీయ బహుమతి కింద రూ.3 వేల నగదును పాఠశాల కరస్పాండెంట్ మారుతి అందజేశారు.

అక్రమంగా ఇసుక తరలింపు

- చోద్యం చూస్తున్న స్థానిక అధికారులు
- జిల్లా అధికారుల ఆదేశాలతో కదిలిన యంత్రాంగం



పట్టుకున్న ఇసుక టిప్పర్



గోపన్‌పల్లి శివారులో అక్రమ ఇసుక డంపులు

బిచ్కుంద(జుక్కల్): మంజీర పరివాహక ప్రాంతం నుంచి ప్రతి రోజు అక్రమంగా ఇసుకను లారీలలో తరలిస్తున్నారు. శెట్లూర్, ఖద్‌గాం, పుల్కల్ గ్రామాల పరిధిలో మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా గోపన్‌పల్లి, శెట్లూర్, పుల్కల్, బిచ్కుంద శివారులలో డంపు చేస్తున్నారు. అర్ధరాత్రి ఇసుక వ్యాపారులు జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్, సంగారెడ్డి, కర్ణాటకలోని బీదర్ నుంచి లారీలను రప్పించి అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారు. ప్రతి రోజూ సుమారు 50 లారీల ఇసుకను తరలిస్తున్నారు. నియంత్రించాల్సిన అధికారులే అక్రమార్కులకు సహకారం అందించి.. వారు ఇచ్చిన నజరానా తీసుకోవడంతో యథేచ్ఛగా లారీలలో ఇసుకను తరలిస్తున్నారు. రాత్రి సమయంలో పెట్రోలింగ్‌కు వెళ్లిన పోలీసులకు ఈ విషయం తెల్సినా లారీలను పట్టించుకోకపోవడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. డంపులు ఉన్నాయి లారీలు, ట్రాక్టర్లు పట్టుకోవాలని రెవెన్యూ అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేస్తే మాకు తెలియదు డివిజన్, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలని చెప్పడం గమనర్హం. రెండు శాఖల అధికారులు స్పందించక పోవడంతో ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శెట్లూర్, ఖద్‌గాం, పుల్కల్, హజ్గుల్, బిచ్కుందలో కొందరు ఇసుక మాఫియాగా గ్రూపు ఏర్పాటు చేసుకున్నారు. ప్రజలు లారీలు, ట్రాక్టర్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తే వాహనంతో ఢీకొట్టి చంపుతానని ఇసుక మాఫియా సభ్యులు బెదిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మాకు అందిరి అండదండలు ఉన్నాయి.. ఇసుక తరలింపు కొనసాగుతుందని బహిరంగంగానే చెబుతున్నారు. ఒక్కో లారీ రూ.36 వేలకు విక్రయిస్తున్నారు. ఇసుక లారీని బిచ్కుంద మండలం దాటిస్తామని లారీ యజమానులకు మాట్లాడుకొని ఇసుక లారీ వెంట ఒక కారు, మూడు బైకులు వెంట వచ్చి మండలం దాటిస్తున్నారు.

పై అధికారులకు ప్రజాప్రతినిధుల ఫిర్యాదు..

అక్రమంగా లారీలలో ఇసుక తరలిస్తున్నారు.. గ్రామ శివారులో ఇసుక డంపులున్నాయి వెంటనే పట్టుకోవాలని జిల్లా అధికారులకు ప్రజాప్రతినిధులు శనివారం రాత్రి ఫిర్యాదు చేశారని సమాచారం. జిల్లా నుంచి బిచ్కుంద పోలీసులకు ఆదేశాలు రావడంతో అర్ధరాత్రి వెంటనే తనిఖీలు మొదలు పెట్టారు.

ఇసుక తరలిస్తున్న ఒక టిప్పర్‌ను పట్టుకున్నారు. అప్రమత్తమైన ఇసుక వ్యాపారులు లారీలు, పోలీసులకు దొరక్కుండా సుమారు 30 లారీలను దడ్గి, శాంతాపూర్, డోంగ్లి, మరికొన్ని లారీలు పుల్కల్, మద్దెల్‌చెరువు, పిట్లం మీదుగా వేరే చోటుకు పంపించారు. జిల్లా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణ జరగకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలి



కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న తండావాసులు

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావు

పిట్లం(జుక్కల్): గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. ప్రతి ఒక్కరికి తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. మండలంలోని మద్దెలచెరువు గ్రామంలో ఆదివారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తన గెలుపు కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామంలో అవసరమైన నిధులు సమకూర్చే అంశాలపై చర్చించారు.

ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు పరిశీలన

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండల కేంద్రం శివారులోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పరిశీలించారు. ఆఫీస్‌కు చిన్నపాటి మరమ్మతులు చేపట్టారు. కావాల్సిన సామగ్రిని తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. అలాగే తగిన సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు.

ధ్వజ స్తంభ శిఖర స్థాపన మహోత్సవం

పిట్లం(జుక్కల్): పోతురెడ్డిపల్లి స్కూల్ తండాలో ఆదివారం శ్రీ జగదాంబ, శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ నూతన మందిరాలలో విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ శిఖర స్థాపన మహోత్సవం కార్యక్రమాలను తండావాసులు నిర్వహించారు. ఈ మహోత్సవంలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

అర్చకులు, ఎమ్మెల్యేకు శాలువాతో సత్కరించి ఆశీర్వదించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయసహకారాలు అందిస్తానని పేర్కొన్నారు.

భగవాన్ మృతి పార్టీకి తీరని లోటు

మద్నూర్(జుక్కల్): కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు తమ్మేవార్ భగవాన్ హఠన్మారణం పార్టీకి తీరని లోటని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని భగవాన్ ఇంటికి ఆదివారం ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలివచ్చి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటానని భగవాన్ కుటుంబీకులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఎంపీ బీబీ పాటిల్ సోదరుడి అంత్యక్రియలు



పాడె మోస్తున్న ఎంపీ బీబీ పాటిల్

మద్నూర్(జుక్కల్): జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ సోదరుడు విఠల్‌రావ్ పాటిల్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో భాగంగా బీబీ పాటిల్, పాడె మోశారు. శనివారం మహారాష్ట్రలోని ఔరంగబాద్‌లో విఠల్‌రావ్ పాటిల్ మృతి చెందారు. ఎంపీ బీబీ పాటిల్ స్వగ్రామం డోంగ్లీ మండలంలోని సిర్‌పూర్‌లో ఆదివారం విఠల్‌రావ్ పాటిల్ అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు ఎంపీ బీబీ పాటిల్, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. అంత్యక్రియలకు తెలంగాణ, మహారాష్ట్రకు చెందిన పలు పార్టీల నాయకులు, బంధువులు హాజరయ్యారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు సిర్‌పూర్‌లో ఎంపీ బీబీ పాటిల్‌ను కలిసి పరామర్శించారు.

ఇస్కాన్‌లో సామూహిక భగవద్గీత సత్సంగం



మాట్లాడుతున్న శ్రీమాన్ మాధవ ప్రభూజీ

కామారెడ్డి అర్బన్: మనిషి తన స్వార్థం కోసం ప్రకృతికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నందున అనేక దుష్పరిణామాలు జరుగుతున్నాయని అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) కర్నాటక రాష్ట్రానికి చెందిన ప్రచారకులు శ్రీమాన్ మాధవ ప్రభూజీ అన్నారు. కామారెడ్డి పట్టణం రామారెడ్డి రోడ్డులోని ఇస్కాన్ హరేకృష్ణ కేంద్రంలో ఆదివారం సామూహిక భగవద్గీత సత్సంగం, కీర్తన, ప్రవచనం, భజనలు, హారతి, అన్నప్రసాదం కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీమాన్ మాధం ప్రభూజీ భక్తులనుద్దేశించి మాట్లాడారు. ఇస్కాన్ స్థానిక ప్రతినిధులు వెంకటదాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


సొంతింటి కోసం నిరీక్షణ



సున్నపురాళ్లు తండాలోని గుడిసె

రామారెడ్డి (ఎల్లారెడ్డి): గత సర్కార్ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇంటి కల సాకారం కాలేదు. పదేళ్లు ఎదురుచూపులే మిగిలాయి. రామారెడ్డి మండలంలో ఏడు తండా పంచాయతీలు ఉన్నాయి. 70 శాతం ప్రజలు ఇప్పటికీ గుడిసెల్లోనే బతుకులు కొనసాగిస్తున్నారు. కనీసం బీటీ రోడ్లు కూడా అందుబాటులో లేక నానా అవస్థలు పడుతున్నారు. సర్కార్ మారడంతో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా సొంతిళ్లు నిర్మించుకునే వారికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం చేస్తామని చెప్పడంతో మండలంలోని తండావాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లను త్వరగా ప్రారంభించాలని తండావాసులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా క్రషర్ గుంతలు



నస్రుల్లాబాద్-మైలారం గ్రామాల మధ్య ఉన్న నీటి గుంతలు

- కంచె, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయని అధికారులు
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న స్థానికులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని నస్రుల్లాబాద్, మైలారం గ్రామాలకు కూతవేటు దూరంలో క్రషర్ భూమిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం కంకర క్రషింగ్ నిలిచి పోయినా కూడా అక్కడ ఇంకా కంకర ఉండటంతో సిబ్బంది ఇంకా పనులు సాగిస్తున్నారు.

గుంతలు ఏర్పడ్డ తర్వాత వాటి చుట్టూ హెచ్చరిక బోర్డులు, కంచెలను ఏర్పాటు చేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా గతంలో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.

మచ్చుకు కొన్ని ఘటనలు

- గత ఆగస్టులో 23 ఏళ్ల యువకుడు తోటి మిత్రులతో కలిసి మేకలను కాయడానికి వెళ్లాడు. మేకలకు స్నానం చేయించడానికి మైలారం-నస్రుల్లాబాద్‌ల మధ్య గల క్రషర్‌లో నీటితో నిండి ఉన్న గుంతలోకి దింపాడు. అనంతరం వాటిని బయటకు తీసుకురావడానికి ముగ్గురు మిత్రులు దిగారు. కాని గుంత లోతు తెలియక పోవడంతో తోటి మిత్రుల కళ్ల ఎదుటే మునిగి పోయాడు.
- పని కోసం వచ్చిన ఓ బాలిక ప్రమాదవశాత్తు మృతిచెందింది.
- మైలారం గ్రామానికి చెందిన ఓ మహిళ, కుటుంబ కలహాలతో అందులో దూకగా తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు.
- వీటి వద్దకు ఈ మధ్య ఫోటో షూట్ కోసం అని యువకులు నిత్యం వెళ్తున్నారు. అనుకోని ఘటనలు జరిగితే తల్లిదండ్రులకు క్షోభ తప్పదు. నిత్యం పశువుల కాపరులు వస్తూ ఉంటారని, మూగ జీవాలు సైతం గుంతల అంచు వరకు వెళ్తాయని మరో ఘటన చోటు చేసుకోకముందే కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

విండో చైర్మన్లకు గుండెల్లో దడ

భిక్కనూరు: మండలంలోని సింగిల్ విండో చైర్మన్లు, వైస్ చైర్మన్లకు పదవులు పోతాయేమోనని గుండెల్లో దడ ప్రారంభమైంది. మండలంలో భిక్కనూరు, అంతంపల్లి, జంగంపల్లి, రామేశ్వర్‌పల్లి, తిప్పాపూర్, బస్వాపూర్, పెద్దమల్లారెడ్డి గ్రామాల్లో సింగిల్ విండోలు ఉన్నాయి. వీటన్నింటిలో బీఆర్ఎస్ నేతలే చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఉన్నారు. రాజంపేట మండల కేంద్రంలో ఉన్న సింగిల్ విండో చైర్మన్ నల్లవెల్లి అశోక్, వైస్ చైర్మన్ అంధ్యాల రమేష్‌లపై అవిశ్వాసానికి విండో డైరెక్టర్లు సమ్మతించి అధికారులకు నోటీస్ అందజేశారు. దీంతో జనవరి 2న అవిశ్వాసంపై సమావేశం నిర్వహిస్తున్నట్లు సహకార శాఖాధికారులు నిర్ణయించారు. రాజంపేట సింగిల్ విండోలో 14 మంది డైరెక్టర్లకు గాను 12 మంది డైరెక్టర్లు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు, కాంగ్రెస్‌కు ఒకరు, సీపీఐకి ఒక డైరెక్టరు ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన ఒక డైరెక్టర్ మృతి చెందాడు. ప్రస్తుతం ఉన్న రాజంపేట సింగిల్ విండో చైర్మన్ నల్లవెల్లి అశోక్, వైస్ చైర్మన్ అంధ్యాల రమేష్‌లు ఇద్దరూ బీఆర్ఎస్ నేతలు కావడం గమనర్హం. అవిశ్వాస తీర్మానానికి బీఆర్ఎస్‌కు చెందిన 9 మంది కాంగ్రెస్, సీపీఐలకు చెందిన ఇద్దరూ డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా సంతకాలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్ నేతలు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారు. సింగిల్ విండోల్లో ఉన్న డైరెక్టర్లు కూడా ప్రస్తుతం బీఆర్ఎస్ నేతలు అధికంగా ఉన్నప్పటికి కాంగ్రెస్ పార్టీ వైపు తొంగి చూస్తున్నారని మండలంలో జోరుగా చర్చ కొనసాగుతుంది. సింగిల్ విండోల పదవీ కాలం నాలుగేళ్లు పూర్తయినా ఇంకా ఏడాది మాత్రమే ఉన్న సింగిల్ విండో చైర్మన్, వైస్ చైర్మన్‌లను మార్చాలని కాంగ్రెస్ డైరెక్టర్లు యత్నిస్తుండగా వారికి బీఆర్ఎస్ డైరెక్టర్లు మద్దతు ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అవిశ్వాసం నెగ్గితే మిగితా విండోలలో కూడా చైర్మన్, వైస్‌చైర్మన్‌లపై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

సమాచారం..

ఐదవ తరగతిలో ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి రూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఐదవ తరగతిలో చేరేందుకు నిర్వహించే ప్రవేశపరీక్ష కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ మౌనిక ఆదివారం తెలిపారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఐదవ తరగతిలో చేరేందుకు జనవరి 6లోగా ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ఆమె అన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మద్నూర్(జుక్కల్): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ లక్ష్మీబాయి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రవీశ్వర్‌గౌడ్ తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, తమ తమ ప్రగతి నివేదికలతో సకాలంలో సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

హడలెత్తిస్తున్న గ్రామ సింహాలు



లింగంపేట వీధుల్లో కుక్కల గుంపు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో గ్రామ సింహాలు భయాందోళన కల్గిస్తున్నాయి. కుక్కల దాడిలో చిన్నారులు, పెద్దలు, వాహన చోదకులు గాయాలపాలవుతున్నారు. గ్రామంలో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలపైకి పరుగెత్తుకుంటూ వస్తున్నాయి. ఆదమరిస్తే కాటు వేస్తూ గాయాలపాలు చేస్తున్నాయి. గ్రామంలో రోడ్లపై నడవాలంటే ప్రజలు జంకుతున్నారు. వాహన చోదకులు వెళ్తుంటే ద్విచక్ర వాహనాన్ని వెంబడిస్తున్నాయి.

దాంతో వాహన చోదకులు అదుపుతప్పి పడి పోయి ఆస్పత్రుల పాలవుతున్నారు. రాత్రి వేళ ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. కొద్ది రోజులుగా పలువురిపై దాడి చేసి గాయపర్చినట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి కోతులు, కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించాలని కోరుతున్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పిట్లం: పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే



మెట్ల పూజ చేస్తున్న అయ్యప్ప స్వాములు



తాడ్వాయిలో పూజలు చేస్తున్న స్వాములు



హనుమాన్‌ను సన్మానిస్తున్న అయ్యప్ప స్వాములు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో మహా పడిపూజ వైభవంగా కొనసాగింది. అయ్యప్ప స్వాములు వివిధ రకాల అభిషేకాలు, పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పడిపూజలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పాల్గొన్నారు. ఆయనను అయప్ప స్వాములు శాలువాతో సత్కరించారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రానికి డాక్టర్ దిలీప్‌రెడ్డి నివాసంలో ఆదివారం అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామికి మెట్ల పడిని ఏర్పాటు చేసిన అభిషేకించారు. గురుస్వాములు సంగమేశ్వర్‌గౌడ్, అమర్‌సింగ్ గురుస్వాములు, వేదపండితుడు సంజీవ్‌రావ్ శర్మ పాల్గొన్నారు.

తాడ్వాయిలో ఘనంగా అయ్యప్ప పూజలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఆదివారం సంగాగౌడ్ స్వామి ఇంటిలో అయ్యప్ప స్వాములు ఘనంగా పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమానికి ఇతర మండలాల నుంచి అయ్యప్ప స్వాములు తరలి వచ్చారు. పూజ అనంతరం భిక్ష ఏర్పాటు చేశారు.

అయ్యప్ప పడిమెట్లు వితరణ

రాజంపేట: అయ్యప్ప పడిపూజ మెట్లు, స్వామివారి అలంకరణ టేబుల్‌ను కామారెడ్డి పట్టణానికి చెందిన అయ్యప్ప భక్తుడు హనుమాన్ రెడ్డి ఆదివారం రాజంపేట అయ్యప్ప స్వాములకు అందజేశారు. రాజంపేట గ్రామంలోని వేంకటేశ్వర ఆలయంలో అయ్యప్ప స్వాములు నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ప్రతి రోజు జరిగే పూజా కార్యక్రమాలకు పడిమెట్లు, స్వామివారి అలంకార టేబుల్లు అందించాలనే సంకల్పంతో అయ్యప్ప స్వాములకు ఈ సామగ్రి అందించినట్లు ఆయన తెలిపారు. అనంతరం సత్కరించారు. గురు స్వాములు ఆముద నాగరాజు, ఆద్యాల రమేష్,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రుషితుల్య కార్యక్రమం

బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలో ఆదివారం నాచారం పీఠాధిపతి మధుసూదానంద సరస్వతి స్వామీజీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు రుషితుల్య కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బాన్సువాడకు చెందిన బీజేపీ నాయకులు అర్సపల్లి సాయిరెడ్డి అయ్యప్ప దీక్షధారణ చేపట్టి 18 ఏళ్లు కావడంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం గణపతి హోమం, మధ్యాహ్నం అభిషేకాలు, భజన పడిపూజ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, నాయకులు దుద్దాల అంజిరెడ్డి, పాతబాలక్రిష్ణ, శంకర్‌గురుస్వామి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల పరిశీలన

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలను సమాచార హక్కు పరిరక్షణ కమిటీ సభ్యులు ఇంతియాజ్ ఆదివారం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. విద్యార్థులు తమకు కావలసిన విషయాలను సమాచార హక్కు చట్టం ద్వారా పొందవచ్చని చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయులు సుధాకర్, పరిరక్షణ కమిటీ సభ్యులు లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో తాగునీటికి కటకట



కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌లో ఉన్న తాగునీటి ఫిల్టర్ యంత్రం చెడిపోయింది. కుళాయిలు ధ్వంసమయ్యాయి. తక్షణమే అధికారులు స్పందించి తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.